ఎస్ఈ ఆదిత్యకు వినతి పత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

కదిలిన విద్యుత్ శాఖ

• కరెంటు సమస్యను పరిష్కరిస్తామని హామీ • నమస్తే తెలంగాణ కథనానికి స్పందన

కుభీర్, మార్చి 24 : నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని సోనారి గ్రామంలో సింగిల్ ఫేజ్ కరెంటు అవస్థలపై 'నమస్తే తెలంగాణ' దినపత్రిక మెయిన్‌లో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. నిర్మల్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ బి.సుదర్శన్, భైంసా సబ్ డివిజన్ విద్యుత్ శాఖ అధికారులు, కుభీర్ ఏఈ ఆదిత్యతో కలిసి సోమవారం సోనారి గ్రామానికి చేరుకుని సమావేశమయ్యారు. సింగిల్ ఫేస్ కరెంటు సమస్యను ఒకటి, రెండు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎస్ఈ ఆదిత్య మాట్లాడుతూ.. మాలేగాంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయిందని, ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి, రెండు రోజుల్లో ఇక్కడికి రానుందని, వెంటనే నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సోనారి సబ్‌స్టేషన్ నుంచి మాలేగాం ఫీడర్‌ను వేరు చేయడం ద్వారా లోడ్ రిలీఫ్ అవుతుందని వెల్లడించారు. లోడ్ బదలాయింపు చేపట్టడం ద్వారా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదని పేర్కొన్నారు. కొత్త సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సోనారి గ్రామస్తులు ఆయనకు వినతి పత్రాన్ని అందించి, తక్షణమే గ్రామానికి విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా అందించాలని కోరారు.

జాబ్ మేళాలో అభ్యర్థుల ఎంపిక

ఎదులాపురం, మార్చి 24: పట్టణంలోని శాంతినగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ సోమవారం టీఎస్‌కేసీ (తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్), ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 35 మంది అభ్యర్థులు హాజరవ్వగా, ఎనిమిది మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంగీత తెలిపారు. విద్యార్థులు నైపుణ్యాలను మెరుగు పరుచుకుంటూ ఎక్కడ అవకాశం వచ్చిన సద్వినియోగం చేసుకోవాలని ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ మంజుల తెలిపారు. ఈ మేళాలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జగ్రామ్ అంతర్వేది, టీఎస్‌కేసీ మెంటార్ ఎండీ ఇమ్రాన్ అలీ, హెచ్‌డీఎఫ్‌సీ సీనియర్ మేనేజర్ వినయ్ తదితరులున్నారు.

ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం

బోథ్, మార్చి 24 : 22 సంవత్సరాల పాటు ఆర్మీలో పని చేసి సోమవారం ఉద్యోగ విరమణ పొందిన బోథ్ మండల పొచ్చెర గ్రామానికి చెందిన ఏనుగు ప్రవీణ్ రెడ్డిని ఏడో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఆర్మీ నుంచి రిటైర్డ్ అయి గ్రామానికి వచ్చిన సందర్భంగా ఘనంగా స్వాగతించారు. ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకువచ్చారు. అనంతరం 1997-98 ఏడో తరగతి బ్యాచ్ విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఇక్కడ ఏడోతరగతి బ్యాచ్ విద్యార్థులతోపాటు యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరో రోజుకు సీసీఐ సాధన కమిటీ రిలే దీక్షలు

ఎదులాపురం, మార్చి24: సీసీఐ పునరుద్ధరణ కోసం సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి ఆరో రోజుకు చేరుకున్నాయి. దీక్షలను కోకన్వీనర్ విజ్జగిరి నారాయణ, బండి దత్తాత్రి, అరుణ్ కుమార్, లోకారి పోశెట్టి, బొల్లు ఈశ్వర్ దాస్, జగన్ సింగ్ పూల మాలలు వేసి దీక్ష ప్రారంభించారు. ఈ దీక్షలో ఆదిలాబాద్ రూరల్ మండల బీఆర్ఎస్ నాయకులు గండ్రత్ రమేశ్, సెవ్వ జగదీశ్, వెంకట రమణ, అప్కం గంగయ్య, ఆరిఫ్, రాసం వినోద్, పొచ్చన్న, అఖిలేశ్, గడ్డం శ్రీను, మోతీరామ్, శ్రీనివాస్, ప్రమోద్, నవీన్, భగవాండ్లు, అజిత్, మాధవ్, లచ్చన్న, కాంతారావు, పెందోర్ గంగారాం, సుదర్శన్ తదితరులు కూర్చున్నారు. వారికి మద్దతుగా సీనియర్ జర్నలిస్ట్ నర్సారెడ్డి, మాజీ కౌన్సిలర్ అశోక్ స్వామితోపాటు సీసీఐ సాధన కమిటీ నాయకులు 40 మంది ఉన్నారు.

అవగాహన లేక ప్రబలుతున్న వ్యాధులు

• రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఎదులాపురం, మార్చి 24 : జిల్లాలో గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉందని, సరైన అవగాహన లేక వ్యాధులు ప్రబలుతున్నాయన్నాయని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సోమవారం ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రిమ్స్‌లోని ఆడిటోరియంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య విద్యార్థులకు టీబీ వ్యాప్తి, నివారణ, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, చికిత్స విధానాలను ప్రాజెక్టర్ ద్వారా వివరించారు. అంతకు ముందుకు విద్యార్థులు రంగోళి, పెయింటింగ్, పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ, క్షయ వ్యాధిని పూర్తిగా అంతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజలు కూడా దీనిపై అవగాహన పెంచుకోవాలన్నారు. మూడు వారాల కంటే ఎక్కువగా దగ్గు, జ్వరం ఉంటే పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఇక్కడ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్, వైద్యులు సందీప్ జాదవ్, విద్యా విల్సాన్, మెడికోలు పాల్గొన్నారు.

క్షయ రహిత జిల్లాకు కృషి చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 24: నిర్మల్ జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి రాజేందర్ అన్నారు. ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యాధికారి

నిర్మల్ చైన్‌గేట్ : కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి రాజేందర్

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్

కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో రాజేందర్ మాట్లాడుతూ, జిల్లాలో సిబ్బంది అంకితభావంతో పనిచేయడం వల్ల ఎక్కువ మొత్తంలో కేసులను గుర్తించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీవో రవీందర్‌రెడ్డి, డీఐవో నయనరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ పవన్, డిప్యూటీ జిల్లా మీడియా విస్తరణాధికారి బారె రవీందర్, ఆరోగ్య పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులున్నారు.

భైంసా, మార్చి 24 : పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫిర్దోస్ జబీన్ మాట్లాడుతూ, వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. జాగ్రత్తలు పాటించడం వలన వ్యాధిని అరికట్టవచ్చన్నారు. అనంతరం క్షయ వ్యాధిపై ప్రతిజ్ఞ నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ శేష్ కుమార్, కిషన్, గంగన్న, గంగాధర్, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు తదితరులున్నారు.

ముథోల్, మార్చి, 24 : క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ రాహుల్ అన్నారు. ముథోల్‌లోని ప్రభుత్వ దవాఖానలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ మల్లికార్జున, వెంకట సాయి, టీబీ సూపర్ వైజర్ లాలయ్య, హెడ్ నర్సులు పద్మ, కల్పనతో పాటు తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

లోకేశ్వరం, మార్చి, 24 : మండలంలోని వట్టోలి గ్రామంలో అనారోగ్యంతో మరణించిన క్యాస్తు సురేశ్, మామూళ్ల పోశెట్టిని బీఆర్ఎస్ నాయకులు జడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరిపే శ్యామ్ సుందర్, జోహర్‌పూర్ మాజీ సర్పంచ్ దిగంబర్, బండి ప్రశాంత్, మాజీ సర్పంచ్ సాయన్న, ప్రకాశ్, యూనుస్, రమణారెడ్డి, సాయన్న యోగేష్ తదితరులున్నారు.

నీటి వనరుల పునరుజ్జీవనంపై వీడియో కాన్ఫరెన్స్

ఎదులాపురం, మార్చి 24: భారత ప్రభుత్వం నీతి అయోగ్ జలవనరులు, భూ వనరుల విభాగం సోమవారం న్యూఢిల్లీలో నీటి వనరుల పునరుజ్జీవనం అమలుపై చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో) నీతి ఆయోగ్ అధ్యక్షతన సంబంధిత జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎన్ఐసీ నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. చెరువుల్లో పూడికతీతతో నీటి నిల్వలు పెరిగి భూగర్భ జలాల అభివృద్ధితోపాటు చెరువుల పరిధిలో ఆయకట్టు సాగుకు నీరు అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ దిశగా ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్(ఆకాంక్షాత్మక బ్లాకుల)లో నీటి వనరుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని అమలు చేయడానికి నీతి ఆయోగ్, జిల్లా యంత్రాంగం ఏటీఈ చంద్ర ఫౌండేషన్ సహాయంతో తెలంగాణా రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలాన్ని ఆస్పరేషనల్ బ్లాక్‌గా గుర్తించిందన్నారు. నార్నూర్‌లో అంచనాలను తయారుచేసి నివేదికలు పంపాలని ప్రోగ్రాం డైరెక్టర్ యుగల్ జోషి తెలిపారు.

'మల్లాపూర్' తిరిగి ఇంద్రవెల్లి మండలంలో విలీనం

ఇంద్రవెల్లి, మార్చి24 : రాష్ట్ర విభజన సందర్భంగా సిరికొండ మండలంలో కలిపిన మల్లాపూర్ గ్రామాన్ని తిరిగి ఇంద్రవెల్లి మండలంలో విలీనం చేసినట్లు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి సీతక్క ప్రకటించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అసెంబ్లీ సమావేశంలో మల్లాపూర్ గ్రామాన్ని తిరిగి ఇంద్రవెల్లి మండలంలో విలీనం చేయాలని కోరారు. దీంతో మంత్రి సీతక్క సిరికొండ మండలంలో కలిపిన మల్లాపూర్‌ను తిరిగి ఇంద్రవెల్లి మండలంలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు.

ఎన్యూమరేటర్లకు రెమ్యూనరేషన్ చెల్లించాలి

కుంటాల, మార్చి, 24 : ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే చేసిన ఎన్యూమరేటర్లకు తక్షణమే రెమ్యూనరేషన్ చెల్లించాలని ఎస్టీటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాటి గంగాదాస్, ఎల్మల ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి అధికారుల నుంచి మానసికంగా ఒత్తిడి వచ్చినప్పటికీ విజయవంతంగా సర్వే చేసిన ఎన్యూమరేటర్లకు రెమ్యూనరేషన్ చెల్లించి న్యాయం చేయాలన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఖానాపూర్, మార్చి 24: అత్యుత్సాహంతో వాహనదారుడు కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణ శివారులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం, అంబేద్కర్‌నగర్ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టణానికి చెందిన మొహమ్మద్ మాజహర్ ద్విచక్ర వాహనంపై వచ్చాడు. వాహన పత్రాలు, హెల్మెట్ లేకపోవడంతో అతడిని అపి వాహనాన్ని విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సుధీర్ ఫొటో తీశాడు. దీంతో డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించాడు. మొహమ్మద్ మాజహర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వాహనదారులు హైల్మెట్, సరైన ధ్రువ పత్రాలు తమ దగ్గర ఉంచుకొని పోలీసులకు సహకరించాలని కోరారు.

కలెక్టర్, ఎస్పీని కలిసిన డీఎం

నిర్మల్ అర్బన్, మార్చి 24 : నిర్మల్ డిపో మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పండరి సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ జానకి షర్మిలను మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకేను అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్ తదితరులున్నారు.

తాగునీటి సమస్యలు రాకుండా చూడాలి

దస్తురాబాద్, మార్చి24 : వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ పాల్గొని, మిషన్ భగీరథ లీకేజీలు ఉంటే మరమ్మతులు చేపించాలని సూచించారు. అలాగే త్వరలో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేయాలని సూచించారు.

డివైడర్‌ను ఢీకొని సబ్ స్టేషన్ ఆపరేటర్ మృతి

బాసర, మార్చి 24 : బాసర సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రమోద్ సోమవారం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పోలీసులు వివరాల ప్రకారం, ప్రమోద్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఆలయానికి వెళ్లే మూలమలుపు రెండో ఆర్చిగేట్ వద్ద డివైడర్‌కు ఢీకొనడంతో మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ గణేశ్ పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తహసీల్దార్ బదిలీ

కుంటాల, మార్చి, 24 : కుంటాల తహసీల్దార్‌గా కొంత కాలంగా పనిచేస్తున్న ఎజాజ్ అహ్మద్ ఖాన్ పరిపాలన అవసరాల దృష్ట్యా దిలావర్‌పూర్ మండలానికి బదిలీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మల్ ఆర్డీవో ఆఫీసులో డీఏవోగా పనిచేస్తున్న ఏ కమల్ సింగ్‌ను తహసీల్దార్‌గా కుంటాలకు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దిలావర్‌పూర్ మార్చి 24 : దిలావర్‌పూర్ తహసీల్దార్‌గా పని చేసిన స్వాతిని బదిలీ చేస్తూ నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈమె స్థానంలో కుంటాల తహసీల్దార్ అజీజ్ అహ్మద్‌ఖాన్‌ను నియమిస్తూ ఉత్వర్వులు జారీ చేశారు.

కార్మికులపై దాడి చేసిన ముగ్గురికి రిమాండ్

ఎదులాపురం, మార్చి 24 : కార్మికులపై దాడి చేసిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు మావల పోలీస్ స్టేషన్ ఎస్ఐ వీ విష్ణువర్ధన్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని భగత్‌సింగ్ నగర్ సమీపంలో కేంద్ర విద్యాలయం నూతన బిల్డింగ్ నిర్మాణపనులకు ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు వలస వచ్చి పనిచేస్తున్నారు. ఈనెల 10న భగత్‌సింగ్ నగర్‌కు చెందిన వడ్లూరి రాజు, సమీర్, అర్బాస్ కార్మికులపై తీవ్రంగా దాడి చేశారు. దాడిలో గాయపడినవారు చికిత్స పొందిన అనంతరం సంబంధిత కాంట్రాక్టర్ మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client **M/S Shriram Finance Ltd, Khanapur Branch,** Dist. Nirmal agreed to accord Loan to **Mohammed Qamar Uddin S/o Siraz Mohammed,** Age 70 Yrs, Occ:Retired Employee, R/o H.No.7-26, Indranagar, Khanapur, Nirmal (Dist) mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.
Hence this notice

SCHEDULE OF THE PROPERTY

That the Open Plot comprised under Sy.No s.397/^A, 397/^B, 397/^C admeasuring 3600.00 Sq.Fts equal to 400.00 Sq.Yds equal to 334.44 Sq.Mtrs situated at Maskapur Village, Khanapur Mandal, Nirmal District, Under the jurisdiction Registration District Adilabad, Revenue District Nirmal, Sub District Khanapur.

Bounded as East: Open Land of C.Venkat ramulu, **West:** Open Land of Uppu Rajanna **North:** Khanapur to Maskapur Road **South:** Open Place of Vendor

Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subhashnagar, Nizamabad, Cell:9848094409

ఆకట్టుకున్న త్రినయని సాంస్కృతికోత్సవం

అలరించిన విద్యార్థుల ప్రదర్శన

బాసర, మార్చి 24 : బాసర ఆర్జీయూ కేటీలో సోమవారం నిర్వహించిన త్రినయని సాంస్కృతిక ఉత్సవం విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ విద్యార్థుల నృత్య ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. తెలుగుతోపాటు హిందీ, జానపద, ఇంగ్లిష్ భాషల్లో పాటలు ఆలపించి, వివిధ నృత్య ప్రదర్శనలతో విద్యార్థులు అలరించారు. వీసీ ప్రొఫెసర్ ఏ గోవర్ధన్ మాట్లాడుతూ, త్రినయని పేరిట జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థుల ప్రతిభను, సాంస్కృతిక వైభవాన్ని ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కన్వీనర్లు డాక్టర్ రాములు, డాక్టర్ అజయ్, ప్రభాకర్‌రావు, అసోసియేటెడ్ డాక్టర్ విఠల్, డాక్టర్ మహేశ్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ చంద్రశేఖర్, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఉట్నూర్ రూరల్, మార్చి 24 : తాగునీటి సమస్యను పరిష్కరించాలని మాజీ ఎంపీపీ పంద్రా జైవంత్ రావు అన్నారు. సోమవారం మండలంలోని హీరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శాంతాపూర్ గ్రామంలో పర్యటించారు. గ్రామంలో 8 కుటుంబాలు నివసిస్తున్నాయి. వారికి తాగునీటి అవసరాల కోసం ఒకే ఒక చేతికి పంపు ఉండడంతో దానిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. నెలరోజుల నుంచి బోరులో నుంచి అపరిశుభ్రమైన నీరు రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాన్ని సందర్శించి నీటిని పరిశీలించిన మాజీ ఎంపీపీ శాంతపూర్ గ్రామంలో నివసిస్తున్న ఆదివాసీ ప్రజలకు తక్షణమే అధికారులు నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు ఆత్రం లచ్చు పటేల్, కోడప భీమరావు, గ్రామ పటేల్ జుగారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతి

సారంగాపూర్, మార్చి 24 : మండల కేంద్రంలోని ఉరగుట్ట కాలనీ వాసులు సోమవారం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ శ్రీదేవికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, ఉరగుట్ట కాలనీలో దాదాపు వంద కుటుంబాలు నివసిస్తున్నాయని, ఇరవై సంవత్సరాల నుంచి కాలనీలో డ్రైనేజీలు, సీసీరోడ్లు, తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకోసారి పాలకులు మారినా తమ సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేపడతామన్నారు. ఇందులో మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

13క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

ఇంద్రవెల్లి, మార్చి24 : మండలంలోని ముత్నూర్ గ్రామంలోని సాబ్లే సూరజ్‌కు చెందిన కిరాణ దుకాణంలో సోమవారం 13క్వింటాళ్ల 20కిలోల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సాబ్లే సూరజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దుబ్బక సునీల్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, ముత్నూర్ గ్రామంలోని సాబ్లే సూరజ్‌కు చెందిన కిరాణా దుకాణంలో పీడీఎస్ బియ్యం అధిక మొత్తంలో నిలువ ఉన్నట్లు ముందస్తుగా అందిన సమాచారం మేరకు తనిఖీలు చేసి పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్రమంగా బియ్యం విక్రయిస్తున్న యజమాని సాబ్లే సూరజ్‌ను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి, దుకాణం సీజ్ చేశామన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్ అర్బన్, మార్చి 24 : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు విలాస్ మాట్లాడుతూ, ఐసీడీఎస్ సంస్థ ఏర్పడి 50 సంవత్సరాలు అవుతున్నా అంగన్‌వాడీ ఆయాలు, టీచర్లు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన వీరికి జీతాలు అందించాలని, సమ్మె కాలంలో వీరిపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎన్ రెడ్డి, రమేశ్, అర్చన, జయంతి, అనిత, రాజేశ్వరి, లక్ష్మీ, విజయల, నిర్మల, గంగామణి, శ్రీ వాణి, వనిత తదితరులున్నారు.

అర్జీలు నేరుగా సమర్పించాలి

ఉట్నూర్, మార్చి 24 : గిరిజనులు అర్జీలను గిరిజన దర్బార్‌లో నేరుగా సమర్పించాలని ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ ఏవో దామోదర స్వామి అన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు తమకు పింఛన్లు కావాలని, ఇండ్లు కావాలని, రెవెన్యూ, ఆర్‌వో ఎఫ్ఆర్ భూముల సమస్యలు పరిష్కరించాలని, స్వయం ఉపాధి పథకాలు కావాలని, వ్యవసాయ పనిముట్లు కావాలని, లోన్స్ కావాలని అర్జీలు పెట్టుకున్నారు. వాటిని పరిశీలించి ఆయా శాఖలకు బదిలీ చేశారు. ఇక్కడ ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఈఈ తానాజీ, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మాస్ కాపీయింగ్ జరగద్దు

భైంసా, మార్చి, 24 : మాస్ కాపీయింగ్ లేకుండా పదవ తరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం భైంసాలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను సందర్శించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులు పరిశీలించారు.

మెరుగైన సేవలందిస్తాం

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 24: వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నిర్మల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ బీ సుదర్శనం తెలిపారు. కొత్త విద్యుత్తు సర్వీసుల మంజూరు మరింత సులభతరం చేసినట్లు పేర్కొన్నారు.

నాణ్యమైన వైద్యమందించాలి

ఉట్నూర్, మార్చి24 : గిరిజనులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ దవాఖానను సందర్శించి ఉట్నూర్, నార్నూర్, జైనూర్ మండలాలకు చెందిన రోగులు, బాధితులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆత్రం వెంకట్‌లు ఉన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఇచ్చోడ, మార్చి 24 : మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా టీఎస్ 01 యూసీ7813 నంబర్ గల లారీలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అనంతరం లారీని సీజ్‌చేసి 290 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. లారీ ఓనర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

కడెంలో భారీ వర్షం

కడెం, మార్చి 24: మండలకేంద్రంతోపాటు, పలు గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం ఉరుములు, మెరుపులతో వడగండ్లతో కూడిన వర్షం పడింది. పలు గ్రామాల్లో వరి, మక్క, పసుపు పంటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు పేర్కొన్నారు. దాదాపు రెండు గంటల పాటు కురిసిన వర్షం వల్ల మక్క, వరి పంటలు నేలకొరిగినట్లు, మామిడి కాయలు రాలి ఆపార నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఇచ్చోడ, మార్చి 24 : మండలంలోని మాన్కపూర్ సమీపంలో అటవీ ప్రాంతంలోని వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున